

కొమురవెల్లి మల్లన్న ఆలయ గంగరేగు చెట్టు వద్ద భక్తుల రద్దీ

# పట్నం.. పరవశం

కోటి దండాలయ్యా..
కోరమీసాలయ్య
మల్లన్న దర్శనంతో
పులకించిన భక్తజనం
తొలిరోజు 75వేల మంది
భక్తుల రాక
నేడు కొమురవెల్లి క్షేత్రంలో
పెద్ద పట్నం, అగ్నిగుండం

ఎల్లమ్మ ఆలయంలో అర్చకుడి పూజలు




← కుటుంబ సభ్యులతో బోనం తీసుకుపోతున్న మహిళలు

↑ కొమురవెల్లి ఆలయ రాజగోపురం వద్ద భక్తుల రద్దీ

**గజ్జెల లాగులు..** ఢమరుక నాదాలు.. డోలు చప్పుళ్లు.. అర్చకుల పూజలు.. ఒగ్గు పూజారుల పట్నాలు.. పోతరాజుల విన్యాసాలు.. మహిళల బోనాల సమర్పణతో సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లన్న క్షేత్రం పులకించిపోయింది. ఆదివారం పట్నం వారంతో క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామివారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. మల్లన్న నామస్మరణతో క్షేత్రం పరవశించింది.


మల్లికార్జున స్వామి వారి ఆలయంలో అర్చకుడి పూజలు

చేర్యాల, జనవరి 21: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్న ఉత్సవాలు పట్నం వారంతో ఆదివారం వైభవంగా ప్రారంభం కాగా.. 75 వేల మంది భక్తులు తరలివచ్చారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అనుగుణంగా ఉత్సవాలు కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో మొదటి వారం పట్నం వారంగా పిలవడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ క్రమంలో ఆదివారం పట్నం వారానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. సోమవారం పెద్దపట్నం వేసి అగ్ని గుండం దాటుతారు.

### పవిత్రస్నానం.. అనంతరం దర్శనం

కొమురవెల్లి క్షేత్రానికి శనివారం సాయంత్రం నుంచే భక్తులు చేరుకున్నారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్, ద్విచక్ర వాహనాలపై వచ్చిన భక్తులు గదులను అద్దెకు తీసుకున్నారు. ఆదివారం వేకువజామునే నిద్ర లేచి కోనేరు, కాటేజీల్లో స్నానాలు ఆచరించి క్యూలో గంటల పాటు వేచి ఉండి స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. అనంతరం స్వామివారి ముఖ మండపం, గంగరేగు చెట్టు ప్రాంగణంతో పాటు వారు అద్దెకు తీసుకున్న గదుల వద్ద చిలుక పట్నం,గంగరేగు చెట్టు వద్ద నజరు పట్నం, మహామండపంలో ముఖమండ పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. కొందరు భక్తులు స్వామి వారికి కల్యాణం నిర్వహించడంతో పాటు అమ్మవార్లకు ఒడిబియ్యం పోశారు. అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో ఎ.బాలాజీ, పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, ఏఈవో శ్రీనివాస్, కమిటీ సభ్యులు, అర్చకులు, ఒగ్గు పూజారులు భక్తులకు సేవలందించారు.

### దారులన్నీ.. కొమురవెల్లి క్షేత్రం వైపే..

చేర్యాల, సిద్దిపేట, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, జనగామ తదితర జిల్లాల నుంచి భక్తులు ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో భారీగా కొమురవెల్లి క్షేత్రానికి తరలివచ్చారు. పట్నం వారం సందర్భంగా ప్రధాన రహదారులన్నీ కొమురవెల్లి వైపే కొనసాగాయి. హైదరాబాద్, సిద్దిపేట, చేర్యాల కొమురవెల్లి రహదారుల్లో రెండు కిలోమీటర్ల మేరకు వాహనాల్లో భక్తులు నిండిపోయారు.



### నేడు పెద్దపట్నం, అగ్నిగుండం

మల్లన్న ఆలయవర్గాల సహకారంతో హైదరాబాద్ ఒగ్గు పూజారుల సంఘం ఆధ్వర్యంలో భక్తులు మల్లన్న క్షేత్రంలోని కల్యాణ వేదిక వద్ద సోమవారం పెద్దపట్నం వేసి అగ్ని గుండం తయారు చేయనున్నారు. స్వామి వారి పట్నం వారానికి వచ్చిన భక్తులు పెద్ద పట్నం, అగ్నిగుండం దాటి స్వామివారిని మరోసారి దర్శించుకుంటారు. అనంతరం నల్లపోచమ్మ, కొండపోచమ్మ ఆలయాలకు వెళ్లి అక్కడ అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు.


ఒగ్గు పూజారితో పట్నం వేయించి మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు


బోనాలతో శివసత్తుల పూనకాలు, నృత్యం చేస్తున్న మహిళా భక్తురాలు


ఎల్లమ్మకు భక్తులు సమర్పించిన ఒడి బియ్యం

# దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు


నారాయణపూర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ రజినీ సాయిచంద్

నర్సాపూర్/ శివ్వంపేట, జనవరి 21: నర్సాపూర్ మండలంలోని నారాయణపూర్‌లో సర్పంచ్ మహమ్మద్ ఇస్రత్ ఫాతిమా అబూబాయ్ ఆధ్వర్యంలో హజ్రత్ సయ్యద్ లాల్ షక్వద్రి ఉర్ఫ్ మౌలానా బాబాదర్గా వద్ద ఆదివారం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రజినీ సాయిచంద్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఇంటి వద్ద నుంచి ఎమ్మెల్యే సునీతారెడ్డి పూలు, పండ్ల దట్టీతో దర్గా వద్దకు చేరుకుని ముస్లిం మత ఆచారం ప్రకారం ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ కులాలకతీతంగా ప్రతిఒక్కరూ దర్గాను దర్శించుకొని ప్రార్థనలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఫాతిమా అబూబాయ్ వారిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్ఎస్ నాయకులు అశోక్‌గౌడ్, పంబల్ల భిక్షపతి, మహ్మద్ భోగ చంద్రశేఖర్, బాబాబాయ్, ఆజంబాయ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

### క్రీడల్లో గెలుపోటములు సహజం

క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. నర్సాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సుల్తాన్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా ఆదివారం ఫైనల్ మ్యాచ్ జరిగింది. విజేత సుబ్బు జీఎస్ఎమ్ టీమ్‌కు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు.

# గోదావరి గలగలలు

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్


లద్నూర్ రిజర్వాయర్‌లోకి చేరుకుంటున్న గోదావరి జలాలు

మద్దూరు (ధూళిమిట్ట), జనవరి 21: సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం లద్నూర్ రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు విడుదల చేయలేదు. నీటిమట్టం తగ్గడం, ప్రధాన కాల్వ ఎండిపోతున్న వైనాన్ని ఆదివారం 'నమస్తే తెలంగాణ దినపత్రిక'లో 'గోదావరి జలాల కోసం ఎదురు చూపు' అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన దేవాదుల అధికారులు ఆదివారం రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలను విడుదల చేసి, ప్రధాన కాల్వలోకి నీటిని వదిలారు. కాల్వ పరీవాహక ప్రాంతాల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా, లద్నూర్ రిజర్వాయర్‌లోకి వస్తున్న గోదావరి జలాలను సర్పంచ్ జీడికంటి సుదర్శన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వాయర్‌లోకి పూర్తిస్థాయిలో నీటిని వదిలేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట కొమురవెల్లి ఆలయ కమిటీ మాజీ డైరెక్టర్ కాసర్ల కనకరాజు, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు నంద శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# 'సరిహద్దు' గేట్లు ఎత్తేశారు..!

మూతపడిన పోలీసు, ఎక్సైజ్ చెక్‌పోస్టులు
కర్ణాటక, మహారాష్ట్రకు అక్రమంగా గంజాయి, రేషన్ బియ్యం తరలింపు
ముంబయి, గోవా నుంచి హైదరాబాద్‌కు మద్యం, ఎలక్ట్రానిక్ వస్తువులు, బంగారం..
తనిఖీలు లేకపోవడంతో రెచ్చిపోతున్న అక్రమార్కులు
స్మగ్లింగ్‌కు కేరాఫ్‌గా 65వ జాతీయ రహదారి

జహీరాబాద్, జనవరి 21: గంజాయి, రేషన్ బియ్యం, మద్యంతో పాటు నిషేధిత వస్తువుల అక్రమ రవాణాను అడ్డుకోవడానికి రాష్ట్ర సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు మూణ్ణాళ్ల ముచ్చటగా మారింది. పోలీసు, ఎక్సైజ్ శాఖ చెక్‌పోస్టులు మూతపడడంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని చెరాగ్‌పల్లి శివారులో మాడ్గి చౌరస్తా వద్ద కర్ణాటక సరిహద్దులో 65వ జాతీయ రహదారి, జహీరాబాద్-బీదర్ రోడ్డుపై గణేశ్‌పూర్ శివారు సరిహద్దు వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి రాత్రి, పగలు నిత్యం వాహనాల తనిఖీలు నిర్వహించేవారు. ప్రస్తుతం చెక్‌పోస్టులను ఎత్తివేయడంతో తెలంగాణ నుంచి కర్ణాటక, మహారాష్ట్రకు గంజాయి, రేషన్ బియ్యం.. గోవా, ముంబయి నుంచి హైదరాబాద్‌కు మద్యం, ఎలక్ట్రానిక్స్, బంగారం, వెండి అక్రమంగా రవాణా జరుగుతున్నదని, ఎక్సైజ్ అధికారులకు సమాచారం తెలిసినా వాహనాల తనిఖీలు చేపట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### మూతపడిన చెక్‌పోస్టులు...

బీఆర్ఎస్ సర్కార్ హయాంలో పోలీసులు కర్ణాటక సరిహద్దులో పోలీసు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహన తనిఖీలు చేసేవారు. శాసనసభ ఎన్నికలు ముగిసిన వెంటనే చెక్‌పోస్టులు మూతపడ్డాయి. దీంతో తెలంగాణ వైపు నుంచి కర్ణాటక, మహారాష్ట్రకు ప్రతి రోజూ గంజాయి, రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నది. కర్ణాటక వైపు నుంచి గోవా మద్యం, నిషేధిత వస్తువులు ముంబయి నుంచి ట్రావెల్స్ బస్సులు, కార్లలో వ్యాపారులు ఎలాంటి పన్నులు చెల్లించకుండా ఎలక్ట్రానిక్ వస్తువులు, బంగారం, వెండిని హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. కర్ణాటక నుంచి తెలంగాణలోని సరిహద్దు మారుమూల పల్లెల మీదుగా నిషేధిత వస్తువులు హైదరాబాద్‌కు తీసుకువస్తున్న సంఘటనలు గతంలో అనేకం వెలుగులోకి వచ్చాయి. చెక్‌పోస్టుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పకడ్బందీగా నిఘా పెట్టి పర్యవేక్షించాలని గతంలో పనిచేసిన ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినా స్థానిక అధికారులు పట్టించుకోలేదు. అధికారులకు ప్రతి నెలా మామూళ్లు ఇస్తుండడంతో అక్రమ దందా మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగుతున్నదని ఆరోపణలు ఉన్నాయి.

### చెరాగ్‌పల్లిలో ఎక్సైజ్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలు లేవు..!

రాష్ట్ర ప్రభుత్వం కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేసేందుకు జహీరాబాద్ మండలంలోని చెరాగ్‌పల్లి వద్ద 65వ జాతీయ రహదారిపై ఎక్సైజ్ చెక్‌పోస్టును ఏర్పాటు చేసింది. ఇద్దరు సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది ఉన్నా చెక్‌పోస్టులో కానిస్టేబుళ్లు మాత్రమే విధులు నిర్వహిస్తారు. సీఐలు వారానికి ఒకసారి వచ్చిపోతారని, దీంతో చెక్‌పోస్టులో పనిచేసే కానిస్టేబుళ్లు వాహనాలు తనిఖీ చేయడం లేదనే ఆరోపణలున్నాయి. కర్ణాటక, మహారాష్ట్ర వైపు నుంచి మొలాసిస్‌తో వచ్చే ట్యాంకర్లు తనిఖీ చేసి తెలంగాణలోకి వచ్చేందుకు అనుమతి పత్రాలు ఇవ్వాలి. కానీ ఎక్సైజ్ ఉన్నతాధికారులు విధుల్లో లేకపోవడంతో కింది స్థాయి సిబ్బంది ప్రతి ట్యాంకరు యజమానులు, డ్రైవర్ల నుంచి మామూలు తీసుకొని అనుమతులు ఇస్తున్నట్లు తెలుస్తున్నది.


జహీరాబాద్ మండలంలోని చెరాగ్‌పల్లి శివారులో మాడ్గి చౌరస్తాలో 65వ జాతీయ రహదారి పై మూతపడిన పోలీసు చెక్‌పోస్టు

# ఏడుపాయల్లో భక్తుల సందడి


మెదక్ జిల్లాలోని ఏడుపాయల వనదుర్గా ఆలయం ఎదుట భక్తుల సందడి


పూజలందుకుంటున్న వనదుర్గా భవానీమాత

పాపన్నపేట, జనవరి 21: మెదక్ జిల్లాలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గా భవానీమాత సన్నిధిలో ఆదివారం పెద్ద ఎత్తున భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి ఏడుపాయలకు చేరుకున్న భక్తులు వివిధ పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి దుర్గామాతను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం, తలనీలాలు, కుంకుమార్చనలు, బోనాలు సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏడుపాయల ఆలయ చైర్మన్ సతెల్లి బాలాగౌడ్, ఈవో మోహన్‌రెడ్డి ,సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి,రవివీర్ కుమార్, లక్ష్మీనారాయణ, ప్రతాప్‌రెడ్డి, తోట నరసింహులు, వరుణాచారి, రాజు, శ్రీకాంత్, సంతోష్, యాదగిరి తదితరులు ఏర్పాట్లు చేశారు. వేద పండితులు శంకరశర్మ, పార్థివశర్మ, మురళీధర్ ప్రత్యేక పూజలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పాపన్నపేట ఎస్సై మహిపాల్‌రెడ్డి బందోబస్తు చర్యలు చేపట్టారు.

### అంతా రామమయం


**సిద్దిపేట టౌన్, జనవరి 21:** అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ఆదివారం సిద్దిపేట జిల్లాలోని పలు మండలాల్లో ర్యాలీలు నిర్వహించారు. ధర్మకార్య ఉత్సవ సమితి, హిందూ సంఘాల ఆధ్వర్యంలో సిద్దిపేట పట్టణంలోని మోహినీపురా వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి శ్రీరామచంద్రస్వామి విగ్రహ శోభాయాత్ర నిర్వహించారు.